"కనీసం ఓ గంటైనా గడువు ఇవ్వు. లేకపోతే ఇంతకాలం కష్టపడి సంపాదించినదంతా వృథా అవుతుంది." దీనంగా కోరాడా పిసినారి.

"ఊహూ. తక్షణం రావాల్సిందే."

మృత్యు దేవత తన పట్టుని వదల్లేదు.

"నా ఆస్తిలో సగ భాగం నీకిస్తాను. నాకు కనీసం అయిదు నిముషాలు ఇవ్వు చాలు."

"నీ ఆస్తి మొత్తం ఇచ్చినా సరే ఒక్క నిముషం కూడా గడువు ఇవ్వను. పద పోదాం."

ఆ పిసినారి వెంటనే కలం, కాగితం తీసుకుని గబ గబ ఇలా రాసాడు.

'మీలో ఎవరు ఈ ఉత్తరాన్ని చూసినా సరే. మీరు జీవించడానికి సరిపడే ధనం కన్నా ఎక్కువ ఉంటే, ఇంకా ఎక్కువ సంపాదించడానికి కాలాన్ని వృథా చేయకండి. సంపాదించిన దాంతో హాయిగా జీవించండి. నా ఏభై లక్షల దీనార్లు నా జీవితాన్ని పొడిగించే ఒకే ఒక్క నిముషాన్ని కొనడానికి కూడా పనికి రాలేదు. ఈ సంగతి అందరికీ చెప్పండి.'

తర్వాత అతను మృత్యు దేవత వెంట బయలుదేరాడు.

## 12. విధేయత

ఒకతను తనింట్లో నిద్రిస్తుంటే, అతని పడక గది నిండా అకస్మాత్తుగా వెలుగు నిండింది. దాంతో అతనికి మెలకువ వచ్చింది. అతను లేచి కూర్చోగానే, ఆ వెలుగునించి అతనికి ఆకాశవాణి వినిపించింది.

"ఈ గది బయట పెద్ద రాతి బండ ఉంది. నీ బలమంతా ఉపయోగించి దాన్ని తొయ్యి."

ఆ రోజు నించి ఆ యువకుడు రోజూ ఆ పని చేయసాగాడు. చాలాకాలం అతను ఉదయం నించి సాయంత్రం దాకా ఆ రాతిని తన విశాలమైన భుజాలతో తోయసాగాడు. అది కదలకపోవడంతో బలమంతా ఉపయోగించి తోయసాగాడు. ప్రతీ రాత్రి అతను తన పడకగదిలోకి పూర్తి అలసటతో వచ్చి, ఆ రోజంతా

నిరుపయోగంగా గడిచింది అనుకుంటూ పడుకునేవాడు. కొంతకాలానికి అతను ఓ రాత్రి దేవుడ్ని ఇలా ప్రార్థించాడు.

"ఓ దేవుడా! నువ్వు చెప్పినట్లుగా నేను చాలాకాలంగా కష్టపడి ఆ రాతిని తోస్తూనే ఉన్నాను. కాని దాన్ని అరంగుళం కూడా కదిలించలేక పోయాను. ఎందుకు నేనిలా విఫలుడ్ని అవుతున్నాను?"

వెంటనే అతనికి ఆకాశవాణి వినిపించింది.

"నేను నిన్ను రాతిని తోయమన్నాను. నువ్వు నీ బలమంతా ఉపయోగించి ఆ పని చేస్తూనే ఉన్నావు. దాన్ని కదపమని నేను నిన్ను ఎన్నడూ కోరలేదు కదా. నువ్వు విఫలుడివి అయ్యావని అనుకోవడంలో నిజం లేదు. నీ భుజాలు, చేతులు ఎంత బలంగా మారాయో ఓ సారి చూసుకో. ఆ రాతి నించి నీకు కలిగే ప్రతిఘటన వల్ల నువ్వు ఎంతో బలవంతుడివి అయ్యావు. ఆ రాతి నించే ఆ బలాన్ని పొందావు."

అతను ఆ మాటలు విని సంతోషించాడు.మర్నాడు లేచి వెళ్ళి ఆ రాతిని తోయగానే అది ఈ సారి కొద్దిగా కదిలింది. మనకి దేవుడి నించి అందిన సూచనలని పాటించి విధేయతగా నడుచుకోవడం ఒక్కటే మనం ఆచరించాలి కాని, ఆ పని వల్ల కలిగే ఫలితాన్ని ఆశించకూడదు. అది భగవంతుడి ఇష్టానికి వదిలేయాలి. మనం కొండని కదిలించగలుగుతాం అనుకుంటాం కాని నిజానికి దాన్ని కదిలించేది దేవుడి మీద మనకి గల విశ్వాసం తప్ప మరేం కాదు.

మనం దేవుడి విషయంలో విధేయతగా ఉండాలి తప్ప విజయవంతంగా ఉండాలని అనుకోకూడదు.

## 13. జాగ్రత్త సుమా!

ఓ రోజు ఓ జంట ఓ స్వీట్ షాపులోకి వెళ్ళింది. అతను ఓ పావు కిలో కలాకండ్‌ని కొని పాకెట్‌ని తీసుకున్నాడు. వారిద్దరూ బయటకి వెళ్ళి, ఎదురుగా ఉన్న పార్క్‌లో కూర్చున్నారు. దాన్ని తినడానికి అతను ఆ పాకెట్‌ని విప్పి పెట్టెని తెరవగానే, ఆశ్చర్యంగా అందులో వెయ్యి రూపాయల నోట్ల కట్ట కనబడింది.